
సాక్షి ఒడిశా

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023




శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 3,74,715
బంగారం	1 గ్రాము 300 మిల్లీ గ్రాములు
వెండి	14 గ్రాముల 800 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ

నేటి నుంచి రెండో వందే భారత్ సేవలు



రాష్ట్రంలో రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ఆదివారం నుంచి అందుబాటులోకి రానున్నాయి.

- 8లో



ఈవీఎంలపై వర్క్‌షాప్

రానున్న సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకొని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) శనివారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించింది.

- 8లో

న్యూస్‌రీల్

100 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బరంపురం: స్థానిక గుసానినువాగంలో కొలువై ఉన్నటువంటి మా కాళువా మందిర ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. శిబిరాన్ని మాజీ మేయర్ శిబశంకర్ దాస్ ప్రారంభించారు. అనంతరం ఎంకేసీజీ మెడికల్ కళాశాల వైద్యుల సహకారంతో 100 మందికి ఉచితంగా బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న ఐఐసీ తపన్ కుమార్ మిశ్రా

బరంపురం: రక్తదానం చేయడం వలన ప్రాణదాతలుగా నిలవవచ్చని బరంపురం గొళంతర పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారి తపన్ కుమార్ మిశ్రా పిలుపునిచ్చారు. స్థానిక రొంగాయిలొండా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ దుర్ఘటనల్లో సకాలంల్లో రక్తం అందక, అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేస్తే బాధితులకు సకాలంలో రక్తం అందుతుందని పేర్కొన్నారు. శిబిరంలో రొంగాయిలొండా ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



సత్యనారాయణ మహరణ తయారు చేసిన మ్యాప్

బరంపురం: జీ-20 సదస్సు సందర్భంగా కొద్దిరోజుల క్రితం స్థానిక భేజ్జిపూర్ నీలకంఠ నగర్ 3వ లైన్‌కి చెందిన సైకత శిల్పి సత్యనారాయణ మహరణ తన కళా నైపుణ్యంతో అతి చిన్న సూక్ష్మ భారత్ మ్యాప్‌ను తయారు చేసి స్థానికులను ఎంతగానో ఆకట్టుకున్న విషయం తెలిసిందే. అయితే సత్యనారాయణ మహరణ కళా నైపుణ్యంతో అతి చిన్న భారత్ మ్యాప్ 4.57 సెకండ్స్‌లో తయారు చేయడంతో ఏసియా బుక్ ఆఫ్ రికార్డులో శనివారం స్థానం దక్కింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందిస్తున్నారు.

గంజాయి స్వాధీనం



పోలీసులకు పట్టుబడిన నిందితులు

రాయగడ: కొరాపుట్ జిల్లా నందపూర్ నుంచి అక్రమంగా కారులో తరలిస్తున్న గంజాయిని కాసీపూర్ పోలీసులు శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరు మహిళలు, మరో ముగ్గురు యువకులను అరెస్టు చేసి శనివారం కోర్టుకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే ఎప్పటిలాగే కాసీపూర్‌లోని కుంబారిశిల కూడలిలో పోలీసులు వాహన తనిఖీలను నిర్వహించారు. ఈ క్రమంలో నందపూర్ నుంచి వస్తున్న ఒక కారును ఆపి తనిఖీ చేయగా, కారు వెనుక డిక్కీలో 22 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితుల్లో ముగ్గురు యువకులు కొరాపుట్ జిల్లాకు చెందినవారు కాగా, ఇద్దరు మహిళలు బీహార్‌లోని బోజ్‌పూర్ జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి రూ.13,950ల నగదు, మూడు సెల్ ఫోన్లు, కారు సీజ్ చేశారు.

ఇద్దరు నాయకుల బహిష్కరణ

భువనేశ్వర్: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు రాష్ట్రంలో అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ) శనివారం మయూర్‌భంజ్ జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులను పార్టీ నుంచి బహిష్కరించింది. బీజేడీ ప్రధాన కార్యాలయం నుంచి జారీ అయిన ఉత్తర్వుల ప్రకారం వీరు తక్షణమే పార్టీ నుంచి తొలగించబడ్డారు. వీరిలో ఎస్‌డీసీ సభ్యుడు జలెన్ నాయక్ మరియు తిరింగ్ మండలం అధ్యక్షుడు పరమేశ్వర్ సమద్ ఉన్నారు. మయూర్‌భంజ్ జిల్లా రాయరంగ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో తిరింగ్ మండలం ఒకటి.

మృగాడు..!

- విద్యార్థినిపై పాఠశాల ప్యూన్ అత్యాచారం
- డొంగాశిలిలో ఉద్రిక్త పరిస్థితులు
- పోలీసుల వ్యాన్ తగలబెట్టిన గ్రామస్తులు

రాయగడ: అభం, శుభం తెలియని బాలికను విద్యాలయంలోనే కాటేశాడు ఒక మృగాడు. దగ్గరుండి ఆ బాలికలకు అండగా నిలవాల్సిన ఆ పాఠశాల ప్యూన్ సమాజం తలదించుకునే దారుణానికి ఒడగట్టాడు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని కాసీపూర్ సమితి దొరాగుడ పోలీసుస్టేషన్ పరిధి డొంగాశిలి ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఒక విద్యార్థినిని, అదే పాఠశాలలో ప్యూన్‌గా పనిచేస్తున్న శివప్రసాద్ మిశ్రో అనే వ్యక్తి అత్యాచారం చేసినట్లు బాధితురాలి తల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శుక్రవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనపై ఆగ్రహించిన డొంగాశిలి గ్రామస్తులు ఆశ్రమ పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌డీపీవో రష్మిరంజన్ సేనాపతి, డొంగాశిలి ఐఐసీ కేబీ సామల్ తదితరులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు, గ్రామస్తుల మధ్య జరిగిన వాగ్వాదంతో పోలీసుల తీరును నిరసిస్తు గ్రామస్తులు స్టేషన్ బయట ఉన్నటువంటి పోలీస్ వ్యాన్ తగలబెట్టారు. దీంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమవ్వడంతో గ్రామస్తులను అడ్డుకునేందుకు పోలీసు బలగాలను మోహరించారు. అనంతరం పోలీసులు ప్యూన్ శివప్రసాద్ మిశ్రోను అదుపులోకి తీసుకున్నారు.

డీసీసీ అధ్యక్షుడి పరామర్శ

విద్యార్థినిపై జరిగిన అత్యాచారాన్ని డీసీసీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగో తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ వైఫల్యానికి ఇదొక నిదర్శనమని పేర్కొన్నారు. ఘటనపై అసెంబ్లీలో తమ పార్టీ ఎమ్మెల్యేలు లేవనెత్తుతారని తెలియజేశారు. అనంతరం ఆయనతో పాటు ఆయన సతీమణి, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు కేతకి గొమాంగోలు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్యులతో మట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.



విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న డీసీసీ అధ్యక్షుడు బిజయ్ గొమాంగో



పోలీసుస్టేషన్ బయట తగలబడుతున్న వ్యాన్



కపిలాస్ కూడలిలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఫిర్యాదు మేరకు...

ఘటనపై బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన వివరాల ప్రకారం.. ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లింది. భోజనం చేసిన అనంతరం తిరిగి పాఠశాలకు వచ్చింది. అదే సమయంలో పాఠశాలలో పనిచేస్తున్న ప్యూన్ మిశ్రో విద్యార్థినిని పిలిచి మాయ మాటలు చెప్పి, పక్కనే ఉన్న ఒక గదిలోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. రక్తం మడుగులో పడివున్న విద్యార్థినిని చూసినవారు చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో రాయగడకు చేరుకున్న అనంతరం బాధితురాలికి చికిత్స అందించారు. ఇదిలాఉండగా ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం బిషకేశన్ బాగ్‌ను పోలీసులు సంఘటన గురించి ప్రశ్నించి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హెచ్‌ఎం నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ప్రతిపక్షాల మండిపాటు

విద్యార్థినిపై జరిగిన అత్యాచారంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. అసమర్థ ప్రభుత్వ పాలన అంటూ విరుచుకుపడ్డాయి. జిల్లా బీజేపీ అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ నేతృత్వంలో ఆ పార్టీ కార్యకర్తలు, మహిళా మోర్చా సభ్యులు స్థానిక కపిలాస్ కూడలిలో ఈ మేరకు నిరసన వ్యక్తం చేస్తూ సీఎం నవీన్ పట్నాయక్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు. అభం, శుభం తెలియని చిన్నారిపై అత్యాచారం చేయడం ఘోరమని మండిపడ్డారు. ఇటువంటి ఘటనలు రాష్ట్రంలో తరచూ చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. ప్రజలకు, మహిళలకు రక్షణ కరువయ్యిందని దుయ్యబట్టారు. మహిళా మోర్చా రాష్ట్ర శాఖ కార్యదర్శి ప్రియమణి నాయక్ మాట్లాడుతూ విద్యార్థినిపై అత్యాచారం చేసిన ప్యూన్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే పాఠశాల హెచ్‌ఎంను, జిల్లా ఎస్పీని ప్రభుత్వం స్పందించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ ఎస్సీ, ఎస్టీ మోర్చా రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝి, సీనియర్ నాయకుడు బసంత కుమార్ ఉలక తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థినిని పరామర్శించారు.

ఉమ్మడి అన్వేషణకు ఒప్పందం



ఐఐటీ భువనేశ్వర్-తాయిపీ ఈసీసీ అధికార వర్గాల మధ్య ఒప్పంద చర్చలు జరుగుతున్న దృశ్యం

భువనేశ్వర్: స్థానిక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ఉన్నతాధికారులతో తాయిపీ ఆర్థిక మరియు సాంస్కృతిక కేంద్రం (టీఈసీసీ) ఇద్దరు సభ్యుల ప్రతినిధి బృందం శనివారం సమావేశమైంది. ఈ సందర్భంగా విద్యావేత్తలు మరియు పరిశోధన రంగాల్లో సహకార అవకాశాల అన్వేషణకు చర్చించారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిరింది. ఐఐటీ భువనేశ్వర్ అంతర్జాతీయ సంబంధాల కార్యక్రమంలో భాగంగా ఈ ప్రతినిధులు క్యాంపస్‌ను ప్రత్యక్షంగా సందర్శించారు. తైవాన్ ప్రతినిధులు అధ్యాపక సభ్యులతో సంభాషించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కౌన్సెలర్ మరియు డైరెక్టర్ ప్రొఫెసర్ చిన్-త్సాన్ వాంగ్ మరియు టీఈసీసీ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్లీ చియాంగ్ ఐఐటీ భువనేశ్వర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మాల్కర్‌తో సాధ్యమైన సహకార పరిశోధనలపై విస్తృతంగా చర్చించారు. పరిశోధన సహకారంతో పాటు, రెండు సంస్థల అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థుల మార్పిడి అవకాశాలను కూడా సానుకూలంగా మలచుకునేందుకు చర్చించారు. స్థానిక ఐఐటీలో సౌకర్యాలు మరియు పర్యావరణంపై తాయిపీ టీఈసీసీ ప్రతినిధులు ప్రశంసించారు. ఐఐటీ భువనేశ్వర్ మరియు తైవాన్‌లోని వివిధ విశ్వవిద్యాలయాల మధ్య అవగాహన ఒప్పందాల ద్వారా ముఖ్యంగా ఇంటర్నల్ చిప్ (ఐసీ) డిజైన్ మరియు సూక్ష్మ జీవ ఇంధనాల రంగాల్లో పరిశోధన సహకారాల గురించి చర్చించారు. తైవాన్‌లో భువనేశ్వర్ ఐఐటీ విద్యార్థులకు ఇంటర్న్‌షనల్ ఇంటర్న్‌షిప్ గురించి ప్రస్తావించారు. ఐఐటీ భువనేశ్వర్ సహకార పరిశోధన, అంతర్జాతీయ విద్యార్థులు మరియు అధ్యాపకుల మార్పిడి కార్యక్రమం కింద లోగడ అనేక అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది.

• ఊరంతా.. కేరింత



నందాహండి సమితిలో నువాఖాయ్ బెట్‌ఘాట్ ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. గిరిజనులు సామూహికంగా ఈ పండుగలో పాల్గొన్నారు. గిరిజన సాంప్రదాయ వంటలు చేసుకొని విందారగించారు. తమ సాంప్రదాయ గిరిజన నృత్యాలు చేశారు. - కొరాపుట్

కెనాల్‌లోకి దూసుకెళ్లిన కారు

- ప్రాణాలతో బయటపడిన యువకులు



జయపురం: కెనాల్‌లో పడిన కారు



జయపురం: కెనాల్ నుంచి బయటకు తీస్తున్న కారు



భువనేశ్వర్: ప్రమాదానికి గురైన కారు

జయపురం: దేవమాలికి పిక్నిక్‌కు వెళ్తున్న సమయంలో 26వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఒక కారు అదుపు తప్పడంతో కొలాబ్ ప్రధాన కెనాల్‌లోకి దూసుకెళ్లింది. జయంతిగిరి ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో కారులో పయనిస్తున్న ఐదుగురు యువకులు అదృష్టావశాత్తు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే బిరిగుమ్మ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, స్థానికుల సాయంతో ప్రొక్లెయినర్ ద్వారా కెనాల్ నుంచి కారుని బయటకు తీశారు. కెనాల్ వంతెనకు రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని...

భువనేశ్వర్: కటక్ గొడొగొడియా ఆలయం సమీపంలో ప్రమాదం సంభవించింది. అదుపుతప్పిన కారు త్రినాథ్ ఆలయ ప్రాంగణంలోకి దూసుకుపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. శుక్రవారం అర్ధరాత్రి వేళలో నదీతీరం రహదారిపై వేగంగా వెళ్తున్న హ్యుందాయ్ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. అదృష్టవశాత్తు ప్రాణహాని తప్పింది.

సర్పంచ్‌ల ఆందోళన

- సామూహిక రాజీనామా బెదిరింపు
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న సర్పంచ్‌లు

భువనేశ్వర్: స్థానిక దిగువ పీఎంజీ కూడలి ప్రాంతంలో రాష్ట్రవ్యాప్తంగా బాధ్యతలు నిర్వహిస్తున్న సర్పంచ్‌లు పెద్ద సంఖ్యలో శనివారం నిరసనలు చేపట్టారు. అధిక నిధులు, అధికారాలతో సహా 15 ప్రధాన డిమాండ్ల కోసం దీర్ఘకాలంగా చేస్తున్న అభ్యర్థనలను ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో నిరసన తెలుపుతున్నట్లు ఆందోళనకారులు వెల్లడించారు. మూడంచెల పంచాయతీ రాజ్ విధానంలో నిబంధనల మేరకు సర్పంచ్‌లకు పూర్తి అధికారాల మంజూరు, పంచాయతీలకు నిధుల పెంపు, సర్పంచ్‌ల జీతం రూ.2,350 నుంచి రూ. 30,000కు పెంచడం వంటి కీలకమైన డిమాండ్‌లతో ఆందోళనకు దిగారు. ఈ మేరకు సర్పంచ్‌లు రెండు నెలల క్రితం జిల్లా కలెక్టర్ల ద్వారా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. అయినప్పటికీ తమ డిమాండ్లు ఇంకా నెరవేరకపోవడంతో పలు ప్రాంతాల మండల ప్రధాన కార్యాలయాలు మరియు రాష్ట్ర రాజధానిలో నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ప్రజల కోసం ఎలాంటి సెలవులు లేకుండా 24 గంటలూ పనిచేస్తున్నప్పటికీ నామమాత్రంగా రూ.2,300 గౌరవవేతనం మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పథకాలను మండల స్థాయి అధికారులు తమకు తెలియకుండా పంచాయతీల్లో అమలు చేస్తున్నారన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చకుంటే సామూహిక రాజీనామాలు చేస్తామని, నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఉరికి వేలాడుతున్న వ్యక్తి మృతదేహం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి జగన్నాథపూర్ గ్రామ పంచాయితీ లొగుడ గ్రామ సరిహద్దులో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వెలుగు చూసింది. గ్రామ సమీపంలోని కల్వర్టుకు ఉరి వేసుకొని వ్యక్తి మరణించాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. మృతి చెందిన వ్యక్తి తమ పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తి కాదని స్థానికులు తెలియజేశారు. వేరే ప్రాంతం నుంచి వచ్చి ఉరి వేసుకున్నట్లు తెలుస్తోందన్నారు.

• జగన్నాథుని సన్నిధిలో...



రాష్ట్ర శాసనసభ స్పీకర్ పదవికి ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన ప్రమీలా మల్లిక్ పూరీ సందర్శించి శ్రీ జగన్నాథున్ని శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీమందిరం రత్న వేదిక ముంగిట ఆలయ అధికార వర్గాల ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించిన ప్రత్యేక పూజాదుల్లో ఆమె పాల్గొన్నారు. - భువనేశ్వర్

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల బస్టాండ్‌లో మల్కన్‌గిరికి చెందిన రాజేష్ మండాల్ బస్సుకోసం శుక్రవారం రాత్రి ఎదురుచూస్తూ, జ్వరం ఉండడంతో నిద్రలోకి జారుకున్నాడు. అదే సమయంలో అతని వద్ద నుంచి దుండగులు సెల్‌ఫోన్, రూ.2,500 నగదు, ఒక బ్లూటూత్ హెడ్‌సెట్‌ను దొంగలించారు. దీంతో శనివారం బలిమెల ఐఐసీ సుమన్ పట్నాయిక్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయినే స్వయంగా దర్యాప్తు చేపట్టారు. దొంగతనానికి పాల్పడిన మైనర్ బాలుడితో పాటు బలిమెలకు చెందిన యసు బాగ్ (23), మున్న బాగ్(21) లను అరెస్టు చేశారు. ప్రస్తుతం నిందితులను విచారిస్తున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

క్లుప్తంగా

కొరాపుట్ బస్టాండ్ పరిశీలన



పరిసరాలను పరిశీలిస్తున్న దృశ్యం

కొరాపుట్: జిల్లా కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ పరిసర ప్రాంతాలను కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలెటెందు రంజన్ శెఠి శనివారం పరిశీలించారు. బస్టాండ్‌కి అనుసంధానంగా మురికి కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వారి వినతులతో చైర్మన్ ఆకస్మికంగా పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు మున్సిపల్ కౌన్సిలర్ జామి మల్లేశ్వరరావు ఉన్నారు.

221కి చేరిన స్క్రబ్ టైఫస్ రోగులు

- సుందర్‌గడ్ జిల్లాలో 10 తాజా కేసులు



లార్వా మైట్

భువనేశ్వర్: సుందర్‌గడ్ జిల్లాలో గత 24 గంటల్లో మరో పది మందికి స్క్రబ్ టైఫస్ ఇన్‌ఫెక్షన్ సోకినట్లు తేలింది. దీంతో రాష్ట్రంలో ఈ బాధితుల సంఖ్య 221కి చేరుకుంది. గత 24 గంటల్లో 51 నమూనాలను పరీక్షించగా, వాటిలో 10 పాజిటివ్‌గా తేలాయని సుందర్‌గఢ్ జిల్లా ప్రధాన వైద్యాధికారి (సీడీఎంఓ) కన్హు చరణ్ నాయక్ తెలిపారు. ఇన్‌ఫెక్షన్ సోకిన చిగ్గర్స్ (లార్వా మైట్స్) కాటు ద్వారా స్క్రబ్ టైఫస్ సంక్రమిస్తుంది. ఈ వ్యాధి కేసులు పెరుగుతుండడం జిల్లా ఆరోగ్య శాఖను ఆందోళనకు గురి చేస్తోంది. చిన్నపాటి జ్వరం, ఇతర లక్షణాలు తారసపడిన స్క్రబ్ టైఫస్ పరీక్షలు చేయించాలని జిల్లాలోని వైద్యులందరికీ సూచించారు. అటువంటి వ్యాధి సోకినట్లు తెలితే సత్వర ఉన్నత చికిత్స కోసం రోగులను జిల్లా ప్రధాన ఆస్పత్రి లేదా రూర్కెలా ఐజీహెచ్ ఆస్పత్రికి సిఫారసు చేయాలని తెలిపారు. జిల్లాలో వ్యాధి నివారణకు సరిపడా మందులు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా ఈ ఆస్పత్రుల్లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) కూడా క్లిష్టమైన రోగుల కోసం సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. వారం రోజులకు పైగా జ్వరం ఉంటే వైద్యులను సంప్రదించాలని ఆరోగ్య శాఖ ప్రజలకు సూచించింది.

ఉపాధ్యాయుల సమావేశం వాయిదా

భువనేశ్వర్: స్థానిక లోయర్ పీఎంజీ ప్రాంతంలో ప్రతిపాదించిన ప్రాథమిక ఉపాధ్యాయుల మహా సమావేశం ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేశారు. డిమాండ్ల సాధన కోసం అఖిల ఉత్కళ ప్రాథమిక ఉపాధ్యాయుల సమాఖ్య (ఏయూపీటీఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో ఈనెల 26న భారీ స్థాయిలో మహా సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. వీరి నిర్ణయంపై స్పందించిన ప్రభుత్వం, ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్నతాధికారులతో ముఖాముఖి చర్చలకు శనివారం పిలుపునిచ్చింది. ఈ చర్చలు ఫలప్రదం అయ్యాయి. ఉన్నతాధికారులతో చర్చించిన తర్వాత ప్రతిపాదిత మహా సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆందోళనకు సారథ్యం వహిస్తున్న సంస్థ సెక్రటరీ జనరల్ చారులతా మహాపాత్రో తెలిపారు. వీరి డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం ఈ ఏడాది డిసెంబర్ వరకు సమయం కోరింది. ఈ అభ్యర్థన మేరకు భువనేశ్వర్‌లో తలపెట్టిన మహా సమావేశం ఆందోళనకు వాయిదా వేసినట్లు వివరించారు.

కింగ్ కోబ్రా కలకలం



నెమలికొండ సాయిబులకాలనీలో హతమైన కింగ్‌కోబ్రా

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని నెమలికొండ సాయిబుల కాలనీలో శనివారం ఓ కింగ్‌కోబ్రా కలకలం రేపింది. అందరూ ఇళ్లలో భోజనాలు చేసి సేద తీరుతున్న సమయంలో సర్పం జనావాసాల్లోకి రావడంతో అంతా భయభ్రాంతులయ్యారు. పాము దాదాపు పది అడుగులు ఉండడంతో అంతా ఒక్కటై కర్రలతో దాడి చేసి చంపేశారు. అయితే దీనికి తల్లి సర్పం కూడా ఉండవచ్చని వారు భావిస్తున్నారు.

నేటి నుంచి రెండో వందే భారత్ సేవలు



రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

- వర్చువల్‌గా ప్రారంభించనున్న పీఎం మోదీ

భువనేశ్వర్: రాష్ట్రంలో రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయి. పూరీ – రౌర్కెలా మధ్య ఈ రైలుని నడివనుంది. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం పచ్చజెండా ఊపి రాష్ట్రంలో రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా మరో ఎనిమిది వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ప్రారంభోత్సవంలో భాగంగా ఆయన వర్చువల్‌గా పాలుపంచుకుంటారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సేవలతో పూరీ మరియు రౌర్కెలా మధ్య ప్రయాణ సమయం తగ్గుతుంది. యాత్రికులు, వ్యాపారులు, విద్యార్థులు మరియు పర్యాటకులకు ఈ రైలు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది.

ప్రధాన నగరాలను కలుపుతూ...

రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ శ్రీజగన్నాథుని పుణ్యక్షేత్రం పూరీ, రాష్ట్ర పారిశ్రామిక రాజధాని, ఉక్కు నగరం రౌర్కెలాతో కలుపుతుంది. ఈ మార్గంలో రాష్ట్ర రాజధాని నగరం భువనేశ్వర్, పారిశ్రామిక ప్రాంతం అంగుల్, ఝార్సుగుడ స్టేషన్లలో ఆగుతుంది. శనివారం మినహా వారానికి ఆరు రోజులు నడుస్తుంది. పూరీ నుంచి రౌర్కెలా వరకు 505 కిలోమీటర్ల ప్రయాణ సమయం 7 గంటల 45 నిమిషాలు పడుతుంది.

ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రయాణానికి పూరీ – యోగ్ నగరి రిషికేష్ ఎక్స్‌ప్రెస్ రైలుకు 11.50 గంటలు, పూరీ – హతియా తపస్విని ఎక్స్‌ప్రెస్ రైలుకు 10.25 గంటల సమయం పడుతుంది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఈ మార్గంలో అత్యంత వేగవంతమైన రైలు. ప్రయాణికుల సౌకర్యార్థం విలాసవంతమైన, సౌకర్యవంతమైన, సురక్షితమైన, మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు రైల్వే శాఖ తెలిపింది. మధ్య కోస్తా మరియు పశ్చిమ ఒడిశా జిల్లాలను ఈ రైలు అనుసంధానపరుస్తుంది. పశ్చిమ ఒడిశా ప్రాంతీయుల దీర్ఘకాల కల దీనితో సాకారం కానుంది.

ఉదయం 5 గంటలకు బయల్దేరి..

20836 నంబర్ కలిగిన పూరీ – రూర్కెలా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ పూరీ నుంచి ఉదయం 5 గంటలకు బయల్దేరి అదేరోజు మధ్యాహ్నం 12.45 గంటలకు రౌర్కెలా చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 20835 నంబర్ కలిగిన రౌర్కెలా – పూరీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రౌర్కెలా నుంచి మధ్యాహ్నం 2.10 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9.40 గంటలకు పూరీ చేరుతుంది. ఈ రెండు ప్రాంతాల మధ్య ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, ఢెంకనాల్, తాల్చేర్ రోడ్, అంగుల్, రైరాఖోల్, సంబల్‌పూర్ సిటీ మరియు ఝార్సుగుడ స్టేషన్లలో ఆగుతుంది.

ఈవీఎంలపై వర్క్‌షాప్



ఎన్నికల సంఘం వర్క్‌షాప్ నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) శనివారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించింది. 2024 సంవత్సరంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం) మరియు ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రియల్ (వీవీప్యాట్) మొదటి స్థాయి చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ)పై వర్క్‌షాప్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓ) పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌ను ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) మరియు అదనపు ప్రధాన కార్యదర్శి ప్రారంభించారు. ఈవీఎం [illegible] పారదర్శకత మరియు [illegible] కల్పించేందుకు ఎన్నికల సంఘం [illegible]త్తమైంది. భారత ఎన్నికల సంఘం అధికారులు, సీఈవో, ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియన్ లిమిటెడ్ (ఈసీఐఎల్) ప్రతినిధుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈసీఐఎల్ మరియు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ రంగ సంస్థ ఎన్నికల సంఘం కోసం ఈవీఎం, వీవీప్యాట్ తయారు చేస్తుంది. 2024 సాధారణ ఎన్నికలకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగు యంత్రాలు భారీ స్థాయిలో ఉత్పత్తి చేస్తామని ఈసీఐఎల్ లోగడ జారీ చేసిన వార్షిక నివేదికలో పేర్కొంది.

ఉత్సవాలతో కళాకారులకు అవకాశం



కళాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే సదాశివ ప్రధాని తదితరులు

కొరాపుట్: ఉత్సవాల నిర్వాహణతో కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కలుగుతుందని నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని అన్నారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని నువాబంధు వీధిలో త్రినాథ్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు జరిగే చోట గిరిజన కళాకారులకు వేదికల మీద ప్రదర్శనకి అవకాశం లభిస్తుందన్నారు. అనంతరం వారికి గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు కళాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఘనంగా రాధా జయంతి ఉత్సవం



పెద్ద రాధాకాంత మఠంలో రాధాదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న సేవాయత్‌లు

పర్లాకిమిడి: స్థానిక రాజవీధిలోని జగన్నాథ స్వామివారి మందిరం ప్రాంగణంలో శనివారం రాధా జయంతిని ఘనంగా జరుపుకున్నారు. అంతేకాకుండా పెద్ద రాధా కాంత మఠంలోని రాధాకృష్ణ మందిరంలోనూ వైభవంగా జరుపుకున్నారు. అనేక మంది భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు.



జగన్నాథ మందిరంలో ప్రత్యేక అలంకరణ

కొనసాగుతున్న చవితి ఉత్సవాలు

గణపతి నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం భక్తులు మండపాలకు వెళ్లి బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. కొన్ని గ్రామాల్లో గణపతి విగ్రహాల నిమజ్జనాలు జరిగాయి. యువకులు భారీ విగ్రహాలను వాహనాలపై తరలిస్తూ సందడి చేశారు. మరికొన్నిచోట్ల లడ్డూ వేలంపాట నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: పడాల వీధిలో కొలువుదీరిన గణపయ్య



పర్లాకిమిడి: నిమజ్జనానికి వెళ్తున్న విఘ్నేశ్వరుడు



రాయగడ: లలితా సహస్ర నామాలు పఠిస్తున్న మహిళలు

వినాయక లడ్డూ రూ.1,40,500




డి.గొనపపుట్టుగలో అత్యధిక ధర పలికిన వినాయక లడ్డూతో చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు

కవిటి: మండలంలోని డి.గొనపపుట్టుగలో వినాయక లడ్డూ రూ.1,40,500 పలికింది. శ్రీప్రతిభ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్ధివినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం వినాయకుని లడ్డూ వేలం నిర్వహించారు. పాటలో గొండ్యాల చంద్రశేఖ ర్, రమ్య దంపతులు ఈ లడ్డూను భారీ ధరకు దక్కించుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్

తక్షణ ఫిర్యాదు.. భద్రంగా నగదు



- ఆన్‌లైన్ ఆర్థిక మోసాలకు **1930**తో చెక్

శ్రీకాకుళం క్రైమ్: ఆమదాలవలసకు చెందిన ఓ యువకుడు సైబర్ నేరగాళ్ల మాయలో పడి ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ. 8.87 లక్షలు పోగొట్టుకున్నాడు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని డేఅండ్‌నైట్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద ఓ రిటైర్డు ఉద్యోగి డబ్బులు డ్రా చేసి లెక్కపెట్టుకుంటుండగా వెనుకగా నిల్చున్న యువకుడు అతన్ని ఏమార్చి కార్డును దొంగిలించి రూ. 50 వేలకు పైగా తీసేశాడు. ఈ రెండు ఘటనలలో బాధితులు తక్షణమే అలెర్ట్ అయ్యి బ్యాంకు ప్రతినిధులకే కాక సైబర్ సెల్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు డయల్ చేయడంతో కొంతలో కొంత మేర నష్టాన్ని పూడ్చుకోగలిగారు.

తక్షణ ఫిర్యాదే మార్గం..

బ్యాంకు ఖాతాలోని సొమ్మును సైబర్ నేరగాళ్లు కొట్టేస్తే ఆ సొమ్మును వెంటనే వెనక్కి రప్పించుకోవాలంటే 1930 నంబర్‌కు కాల్ చేయాల్సిందే. 24 గంటలూ ఈ నంబరు పనిచేస్తుంది. 1930 కాల్‌సెంటర్‌లో పనిచేసే సిబ్బంది అన్ని బ్యాంకులు యూపీఐ వ్యాలెట్లకు సంబంధించి ప్రతినిధులు, అధికారులను నేరుగా సంప్రదిస్తారు. బాధితుడి లావాదేవీల వివరాలన్నీ తీసుకుని ఏ బ్యాంకు ఖాతా నుంచి డబ్బు పోగొట్టుకున్నాడో తెలుసుకుని ఆ బ్యాంకు నోడల్ అధికారికి సమాచారమిస్తారు. అతను బాధితుని ఖాతాను పరిశీలించి అందులో సొమ్ము ఏ ఖాతాకు బదిలీ అయ్యిందో గుర్తించి సంబంధిత బ్యాంకు అధికారికి సమాచారమిస్తారు. ఎవరైతే మోసగించి తమ ఖాతాలో డబ్బులు వేసుకున్నారో వారి ఖాతాను సంబంధిత బ్యాంకు వారు ఫ్రీజ్ చేస్తారు. అంతే కాక బాధితుని ఖాతాలోని లావాదేవీలన్నీ బ్లాక్ చేస్తారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు కొట్టేసిన డబ్బు ఏదో ఒక బ్యాంకులో ఫ్రీజ్ అయి ఆ ఖాతా వివరాల ఆధారంగా మోసం చేసిన వారిని గుర్తించే వీలు కలుగుతుంది. ఒకవేళ అకౌంటు ఫ్రీజ్ చేసేలోగా నగదును మోసగాళ్లు విత్‌డ్రా చేస్తే నగదు బదిలీ అయిన విధానం, బ్యాంకులు ఇచ్చే సాంకేతిక ఆధారాల సాయంతో నేరస్తులను పోలీసులు పట్టుకోవడానికి సులభమవుతుందని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

బాధితుడు చేయాల్సింది..

- సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు డయల్ చేయాలి.
- సంబంధిత బ్యాంకు కస్టమర్ కేర్‌కు కాల్ చేసి క్రెడిట్, డెబిట్ కార్డులు, లావాదేవీలు బ్లాక్ చేయించాలి.
- పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వక ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా చూసుకోవాలి.
- జిల్లా సైబర్ క్రైమ్ సెల్‌కు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలి.
- బాధితుని బ్యాంకు లావాదేవీల డీటెయిల్స్, ఎఫ్ఐఆర్‌కాపీలు అన్నీ బ్యాంకు వారికి సమర్పించాలి.
- ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలంటే హెచ్‌టీపీపీఎస్:సీవైబీఈఆర్‌సీఆర్ఐఎమ్ఈ.జీవోవీ.ఐఎన్‌కు వెళ్లాలి.

మీరే స్ఫూర్తి.. మీదే కీర్తి

- ఉత్సాహంగా విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: విభిన్న ప్రతిభావంతుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, వారిని ప్రోత్సహిస్తే సకలాంగులకు ఏమాత్రం తీసిపోరని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. ఉన్నతమైన లక్ష్యం ముందు అంగ వైకల్యం ఓడిపోతుందని చెప్పారు. సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా నిర్వహించిన జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.నవీన్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు మైదానం వద్దకు రావడమే వారి తొలి గెలుపని అన్నారు. తల్లిదండ్రులు కూడా వీరిని మరింత ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ రోణంకి జయప్రకాష్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి, వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి ఏటా క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

జిల్లా నలుమూలల నుంచి హాజరు..

విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 147 మంది బాలబాలికలు హాజరయ్యారు. 6 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారికి క్రీడా పోటీలు జరిగాయి. నడక పోటీలు, పరుగుపందాలు, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, షాట్ పుట్, చెస్, క్యారమ్స్, సాఫ్ట్‌బాల్ ప్లే, వంటి క్రీడల్లో విభిన్న ప్రతిభావంతులు ప్రాతినిధ్యం వహించారు. జిల్లా విద్యా అధికారి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.వెంకటరావు, జిల్లా సమగ్ర నుంచి బి.గోవిందరావు, పూడి జనార్దనరావు, పలువురు సెక్టోరల్ అధికారులు, పీడీలు, కోచ్‌లు తదితరులు హాజరయ్యారు.



లాంగ్‌జంప్‌లో అదరహో అనిపిస్తూ..



పరుగు పోటీల్లో విభిన్న ప్రతిభావంతులు

క్లుప్తంగా

5కే రన్‌లో సత్తా చాటిన అథ్లెట్



నగదు బహుమతి అందుకుంటున్న గోవర్ధనరావు

వంగర: హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచేందుకు శ్రీకాకుళంలో శనివారం నిర్వహించిన యూత్‌ఫెస్ట్ 5కే మారథాన్‌లో వంగర మండలం మద్దువలస పంచాయితీ జగన్నాధవలస గ్రామానికి చెందిన అథ్లెట్ నాచు గోవర్ధనరావు సత్తా చాటాడు. జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచి నగదు బహుమతిని జిల్లా క్రీడల అధికారి శ్రీధర్ నుంచి అందుకున్నారు. అథ్లెట్ గోవర్ధనరావును పలువురు అభినందించారు.

పులి కలకలం



ఎస్.కోట సీతారాంపురంలో పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి పంచాయతీ శివారు ఎస్.కోట సీతారాంపురం సమీపంలో శుక్రవారం రాత్రి పులి సంచరించినట్లు పాదముద్రలు వుండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఇందుకు సంబంధించి డీఆర్‌ఓ రవికుమార్, స్థానికులు అందించిన వివరాలు... ఎస్.కోట సీతారాంపురం గ్రామానికి చెందిన పరవాడ దాలినాయుడు శనివారం ఉదయం కళ్లంలోకి వెళ్లేసరికి ఆవుదూడ కనిపించకపోవటంతో పరిసరాల్లో వెతికారు. ఆవు దూడ ఆచూకీ దొరక్కపోగా... పులి పాదముద్రలు చూసిన స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. దీంతో డీఆర్‌ఓ రవికుమార్, వెంకయ్యపాలెం బీట్ ఆఫీసర్లు సూర్యనారాయణ, పూజ తదితర సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. తమ పరిశీలనలో పులి పాదముద్రలు గుర్తించామని పులి అనంతగిరి కొండల వైపు వెళ్లినట్లు పాదముద్రలు చూసి గుర్తించినట్లు డీఆర్‌ఓ తెలిపారు. ఉదయం 10 గంటల వరకు బయటకు వెళ్లవద్దని, సాయంత్రం 4 గంటలకే ఇళ్లకు చేరుకోవాలని ప్రజలను చైతన్యపరిచినట్లు చెప్పారు.

వాలీబాల్ పోటీలకు స్పందన



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

విజయనగరం: రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు శనివారం నిర్వహించిన వాలీబాల్ పోటీలకు స్పందన లభించింది. క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన మాసోత్సవాల్లో భాగంగా స్థానిక రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించిన పోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన 40 జట్లు పాల్గొన్నాయి. వీరికి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధి టీవీ భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఉత్సుకత చూపించారు. విజేతలకు వచ్చే నెల 2న నిర్వహించనున్న యువజన మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉడత్తు రాజేష్, అరుణ్ సోడాని తెలిపారు. అదేవిధంగా ఈనెల 24వ తేదీ సాయంత్రం వాయిస్ ఆఫ్ విజయనగరం ఫైనల్స్, 26న బ్రైడ్స్ ఆఫ్ ఇండియా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు క్లబ్ ప్రతినిధులు, వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేషనల్ యోగా రిఫరీగా ఈశ్వరరావు



ఈశ్వరరావుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) యోగా అధ్యాపకులు డాక్టర్ ఈశ్వరరావు నేషనల్ యోగా రిఫరీగా ఎంపికయ్యారు. జాతీయ స్థాయి యోగా పోటీలకు రిఫరీగా వ్యవహరిస్తారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు శనివారం అందజేసి, అభినందనలు తెలియజేశారు. ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అధికారులు అభినందించారు.

రైతన్నకు రుణ సాయం

రైతే రాజు అన్న నానుడిని నిజం చేసేలా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలబడుతోంది. పంట సాగు పెట్టుబడి నుంచి దిగుబడుల కొనుగోలు వరకు అన్నింటా అండగా ఉంటూ రైతు సంక్షేమానికి సాయం అందిస్తోంది. ప్రభుత్వ సాయంతో పాటు రుణం కావాలనుకున్న రైతులకు ఆ సాయం కూడా అందేలా చర్యలు చేపడుతూ రైతుల మన్ననలు అందుకుంటోంది. దీంతో వ్యవసాయం పండగలా మారింది.

- ఖరీఫ్‌లో రుణాలు ఇచ్చింది రూ.1517 కోట్లు
- టెర్మ్ లోన్స్ రూ.1207 కోట్లు
- రబీ లక్ష్యం రూ.1410 కోట్లు



వరి పంటలో ఎరువు వేస్తున్న రైతు

విజయనగరం ఫోర్ట్: రైతు సంక్షేమానికి పలు సంక్షేమ కార్యక్రమాలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతుంది. విత్తు దగ్గర నుంచి పంట కొనుగోలు వరకు అన్నింటా సహాయాన్ని అందిస్తోంది. పంట సాగు పెట్టుబడి కోసం రైతులకు ఏటా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రూ.13,500 సాయాన్ని అందిస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతు మంగిటకే చేరుస్తోంది. రైతు పండించిన పంటను కూడా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర కల్పిస్తోంది. రైతులకు అవసరమైన పంట రుణాలను కూడా ప్రభుత్వం అందించి రుణ సాయాన్ని చేస్తోంది.

ఖరీఫ్‌లో రూ.1517 కోట్ల రుణాలు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కోట్లాది రుపాయిల పంట రుణాలు అందించారు. టెర్మ్ రుణాలు కూడా ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ పంట రుణాల లక్ష్యం రూ.2025 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.1517 కోట్లు రుణాలు ఇచ్చారు. 1,22,000 మందికి పంట రుణాలు ఇచ్చారు. టెర్మ్ లోన్లకు సంబంధించి లక్ష్యం రూ.1363 కోట్లు కాగా ఇంతవరకు రూ.1207 కోట్ల రుణాలు అందించారు. 44,650 మందికి రుణాలు ఇచ్చారు. లక్ష్య సాధనకు ఇంకా సమయం ఉండడంతో పూర్తి స్థాయిలో రైతులకు రుణాలు అందించే అవకాశం ఉంది. గత ఏడాది ఖరీఫ్‌లో రుణ లక్ష్యం రూ.1806 కోట్లు కాగా రూ.2016 కోట్లు రుణాలు అందించారు.

కౌలు రైతులకూ..

ప్రభుత్వం సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు రుణాలను అందిస్తోంది. రైతులకు ఎటువంటి ప్రయోజనాలు వర్తింపజేస్తోందో అదే స్థాయిలో కౌలు రైతులకూ వర్తింపజేస్తోంది. సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని వర్తింపజేస్తుంది. వారికి కూడా విత్తనాలు, ఎరువులు అందిస్తోంది. భూ యాజమానులకు ఇబ్బంది లేకుండా పంట రుణాలను కూడా అందిస్తోంది. ఈ ఏడాది 598 మంది రైతులకు రూ.1.81 కోట్ల రుణాలను అందించారు.

రబీ లక్ష్యం రూ.1410 కోట్లు

ఖరీఫ్ సీజన్ సెప్టెంబర్ నెలఖారుతో ముగుస్తుంది. అక్టోబర్ నెల నుంచి రబీ సీజన్ ప్రారంభం అవుతుంది. అక్టోబర్ నెల నుంచి రబీ సీజన్‌కు సంబంధించి పంట రుణాలను రైతులకు అందిస్తారు. రబీ సీజన్‌లో రూ.1410 కోట్ల రుణాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అందరికీ రుణాలు

రైతులందరికీ పంట రుణాలను అందిస్తున్నాం. సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు కూడా రుణాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాం. ఇప్పటి వరకు రుణాలు పొందని వారు కూడా పొందే విధంగా వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

పైడితల్లి పండగకు విస్తృత ఏర్పాట్లు



పైడితల్లి అమ్మవారి జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపిక, ఆలయ సిబ్బంది

- ఎస్పీతో కలిసి పైడితల్లి ఆలయాన్ని సందర్శించిన కలెక్టర్

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి సిరిమాను సంబరానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఎస్పీ ఎం.దీపికతో కలిసి ఆలయ పరిసరాలను శనివారం క్షుణ్ణంగా పరిశీలించారు. భక్తుల రాకపోకలు, వీఐపీల దర్శన ఏర్పాట్లపై ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణితో చర్చించారు. అమ్మవారి ఆలయం పక్కనున్న కట్టడాలను త్వరగా తొలగించి చదును చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ అమ్మవారి పండగకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సామాన్య భక్తులకు సైతం సంతృప్తికరమైన దర్శనం కల్పించే ప్రణాళికను రూపొందిస్తున్నామని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, సంస్థల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకుంటూ ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పండగను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పర్యటనలో ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, డీఎస్పీ ఆర్.గోవిందరావు, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్



ఎం.జి.రోడ్డులో విద్యుత్ మీటర్లను పరిశీలిస్తున్న సీఎండీ పృథ్వితేజ్

విజయనగరం ఫోర్ట్: వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృధ్వితేజ్ అన్నారు. డి-1, డి-2 సెక్షన్ పరిధిలోని ఎంజీ రోడ్‌లోని పలు గృహాలు, వ్యాపార సంస్థలకు చెందిన మీటర్ల పనితీరును శనివారం పరిశీలించారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని, దీనికోసం ఆన్‌లైన్‌లో వివిధ యాప్‌లను అందుబాటులో ఉంచామన్నారు. వినియోగదారుల సిటిజన్ చార్టర్‌ను కచ్చితంగా అమలు చేస్తున్నామని, ఆలస్యమైతే అందుకు కారకుల నుంచి జరిమానా వసూలు చేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ కనెక్షన్ల కోసం దళారులను సంప్రదించవద్దన్నారు. నేరుగా సంస్థ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ప్రతి వినియోగదారుడు తన విద్యుత్ సర్వీస్‌ను ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేసుకోవాలని, దీనికి సంబంధిత సెక్షన్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ముప్వల లక్ష్మణరావు, ఈఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తుపై దిశా నిర్దేశం



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక



సమావేశంలో పాల్గొన్న అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ :

కేసుల దర్యాప్తులో కచ్చితత్వం పాటించాలని, విచారణ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఉదయం ఆగస్టు నెలకు సంబంధించిన కేసులపై పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘించి ప్రమాదాలకు కారకులైన వారి లైసెన్సు రద్దు చేస్తామని, ఈ సెప్టెంబరు నెలలోనే జిల్లాలోని 29 తీవ్రమైన ప్రమాదాల కేసుల్లో 22 మంది వాహనచోదకుల లైసెన్సు రద్దు చేశామని హెచ్చరించారు. ప్రాధాన్యత కేసులపై దృష్టి సారించి రౌడీషీటర్లు, ముద్దాయిలుగా ఉన్న కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీటు దాఖలుపర్చాలని, నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ల ముద్దాయిలను కోర్టులో హాజరుపర్చాలన్నారు. జాతీయ రహదారిపై గల దాబాలు, షాప్స్, టైర్ పంచరింగ్ దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రమాదకరమైన ప్రదేశాలను గుర్తించి నిత్యం వాహనాలను తనిఖీ చేసి స్పీడ్ బ్రేకర్లు, విజిబుల్ రంగులు వేసి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు ఎస్.బాలరాజు (స్పెషల్ బ్రాంచి), వై.శృతి (శ్రీకాకుళం సీడీపీవో), డి.బాలచంద్రారెడ్డి (టెక్కలి), నాగేశ్వరరెడ్డి (కాశీబుగ్గ), డైరెక్టర్ ఆఫ్‌పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.మల్లేశ్వరరావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కె.తిరుమలరావు, కె.శంకరరావు, శ్రీకాంత్, సీనియర్ ఏపీపీలు నాగభూషణం, సుశీల, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

తానా కవయిత్రుల సమ్మేళనానికి 'వాసవి '



కరకవలస వాసవి

శ్రీకాకుళం కల్చరల్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక ఈ నెల 24న ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నారీ సాహిత్యభేరీ అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనం కార్యక్రమానికి శ్రీకాకుళం నగరానికి చెందిన కరకవల స వాసవిని ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. ఇంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో తనకు విశిష్టస్థానం కల్పించిన తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ టి.ప్రసాద్, సమన్వయ కర్త చిరుగురుమళ్ల శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఓబీసీలకు అవకాశం ఇవ్వండి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చట్టసభల్లో ఓబీసీల కు అవకాశం కల్పించాలని, మహిళా రిజర్వేషన్ బిల్లులో వెనుకబడిన మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని జ్యోతిబాపూలే ఆల్ ఇండియా ఓబీసీ అసోసియేషన్ ఉత్తరాంధ్ర జనరల్ సెక్రటరీ రౌతు శంకరరావు కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ చేసి బీసీ మహిళల వాటా ఎంతశాతమో తేల్చాలని డిమాండ్ చేశారు. కులగణన చేపట్టి ఓబీసీల వాటా బీసీలకు ఇవ్వాలని కోరారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేయాలని, బీసీలకు రూ.7లక్షల కోట్లు అభివృద్ధి నిధులు ఇవ్వాలని కోరారు. బీసీలకు క్రిమిలేయర్ తొలగించాలని కోరారు.

కొండపేటలో వైరల్ జ్వరాలు

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు పంచాయతీ కొండపేట గిరిజన గ్రామంలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామంలో చిన్నారులు, వృద్ధులు జ్వరం బారిన పడి వైద్య సేవలు పొందుతున్నారు. అయితే బొంతు జంక్షన్‌లో పీహెచ్‌సీ ఉన్నప్పటికీ సిబ్బంది సరిగా విధులకు హాజరు కావడం లేదని, వైద్య సేవలు సరిగా అందించక పోవడంతో ఆర్‌ఎంపీ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని గ్రామానికి చెందిన పలువురు ఆరోపిస్తున్నారు.

దూడల పోషణ కీలకం



దూడలను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ కిశోర్

గార: దూడల పెంపకంలో పోషణే కీలకమని పశు సంవర్ధక శాఖ జేడీ ఎం.కిశోర్ అన్నారు. జల్లువలస కూడలి వద్ద శనివారం లేగదూడల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూడలకు మొదటి మూడు నెలలు తల్లిపాలు అందివ్వాలని, తద్వారా దూడ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఆడదూడ పుట్టే అవకాశం ఉన్న పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పాడి పరిశ్రమలో పశుగ్రాసాలు అందించడం కీలకమన్నారు. ఆరునెలల వరకు ప్రతి నెలా పొట్టపురుగుల మందు అందించాలన్నారు. సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్ మాట్లాడుతూ పశువుల పెంపకంలో అధునాతన పోకడలను రైతులు అవలంబించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆరంగి రమణమూర్తి, ఉప సంచాలకులు డాక్టర్ ఎం.జగన్నాథం, పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ ఎస్. మన్మధరావు, ఏడీ డాక్టర్ జీవీ రాజశేఖరం, గోపాలమిత్ర ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై న్యాయమూర్తి కన్నెర్ర

- ప్రీలిటిగేషన్ కేసుపై విచారణ



కేసు విచారిస్తున్న ఎస్.కోట న్యాయమూర్తి ఎస్.వాణి

శృంగవరపుకోట: చెట్ల అక్రమ నరికివేతపై స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో దాఖలైన ప్రీలిటిగేషన్ కేసును న్యాయమూర్తి ఎస్.వాణి శనివారం విచారించారు. ఈ సందర్భంగా చట్టాలను పట్టించుకోకుండా భారీ చెట్లు నరికేస్తుంటే ప్రభుత్వ శాఖల అధికారులు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. తక్షణం అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పూర్తి స్థాయి అనుమతులు లేకుండా చెట్లను తొలగించకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ డి.శ్రీనివాసరావును ఆదేశించారు. పర్యావరణ వేత్త బి.రామకృష్ణ పట్టణంలో పలు భారీ వృక్షాలను అనుమతులు లేకుండా అక్రమంగా నరికేస్తున్నారంటూ తహసీల్దార్, ఆర్‌అండ్‌బీ ఏఈ, విద్యుత్ శాఖ ఏఈ, పంచాయతీ ఈఓ తదితరులపై ప్రీలిటిగేషన్ కేసు నమోదు చేశారు. దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి వాణి ప్రీలిటిగేషన్ కేసులో దీన్ని పరిష్కరించలేమని, ప్రత్యేక కేసు దాఖలు చేయాలన్నారు. పర్యావరణ రక్షణ కోసం చెట్ల నరికివేతను అడ్డుకోవాల్సిన సంబంధిత శాఖల అధికారులు చట్టాల అమల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, పర్యావరణ పరిరక్షణకు తగిన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని ఫిర్యాదుదారు, న్యాయవాది బి.రామకృష్ణ కోరారు. మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటామని అధికారులు న్యాయమూర్తి సమక్షంలో అంగీకరించారు. విచారణకు హాజరుకాని విద్యుత్ శాఖ ఏఈ, పంచాయతీ ఈఓలకు నోటీసులు జారీ చేసి కేసును వాయిదా వేశారు.

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా : డీఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్

గజపతినగరం : గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశామని బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. గజపతినగరం సర్కిల్ ఆఫీస్ కార్యాలయాన్ని శనివారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణ చేసిన వారితో పాటు గంజాయిని సేవించిన వారి సమాచారాన్ని ప్రజలు అందించాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కూడా నిఘా పెట్టామన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

బొండపల్లి మండలం గురుడుబిల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడడంతో శనివారం గజపతినగరంలో ఆయనను అదుపులోకి తీసుకొని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట సీఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్ఐ గంగరాజు ఉన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'లో 500 వైద్య శిబిరాలు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు



జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్ చూపిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 482 వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, 18 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 500 వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 5 వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళ్లి ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటారని తెలిపారు. 18 ఏళ్ల పైబడిన వారిందరికి బీపీ, సుగర్, హెచ్‌బీ పరీక్షలు, పదేళ్ల పైబడిన వారికి హెచ్‌బీ పరీక్ష చేస్తారని తెలిపారు. పరీక్షల వివరాలను ఏఎన్‌ఎం ఏపీసేవ పోర్టల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారని చెప్పారు. శిబిరం ముందు రోజు గుర్తించిన వారి ఇంటికి ఒకటి చొప్పన టోకెన్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఐదు దశల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి ఫేజ్‌లో వలంటీర్లు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తారని అన్నారు. రెండో ఫేజ్‌లో సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి వ్యాధులపై సర్వే చేస్తారని తెలిపారు. ఫేజ్-3లో వలంటీర్లు, ప్రజాప్రతినిధులు వైద్య శిబిరం నిర్వహించడానికి మూడు రోజులు ముందు వైద్య శిబిరం ఫలానా చోట నిర్వహిస్తారని ఇంటింటికి వెళ్లి చెబుతారని తెలిపారు. ఫేజ్-4 లో వైద్య శిబిరం నిర్వహించి, వైద్య పరీక్షలు చేసి అవసరమైన చికిత్స, మందులు అందజేస్తారని, ఫేజ్- 5 లో జిల్లాలో వైద్యం అందించలేని వారి వివరాలు సేకరించి వారికి ఎక్కడైతే సేవలు అందుతాయో ఆయా ఆస్పత్రులకు రిఫర్ చేస్తామని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు లక్ష ఇళ్లను సందర్శించి, 2.50 లక్షల మంది ప్రజలను సర్వే చేయడం జరిగిందని తెలిపారు.

రక్త నిల్వలను పెంచాలి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని రక్త నిధి కేంద్రాల్లో రక్త నిల్వలను పెంచాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో సేవాపక్వాడ్ కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త నిల్వల సంఖ్యను పెంచడం కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతుందని తెలిపారు. రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. రక్తదాతలే ప్రాణదాతలని తెలిపారు. మనిషి మాత్రమే రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న సాటి మనిషిని కాపాడగలడని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఏడాదికి నాలుగు పర్యాయాలు రక్తదానం చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, డీఐసీ సాక్షి గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటేశుని కల్యాణం

- శాస్త్రోక్తంగా నిర్వహించిన అర్చకస్వాములు
- స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



వేంకటేశ్వర స్వామి కల్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్:

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామ స్వామివారి సన్నిధిలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం సాయంత్రం కనులపండువగా సాగింది. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, బాలభోగం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. తరువాత యాగశాలలో ప్రత్యేక హోమాలు జరిపించి స్వామివారిని రామతీర్థం తిరువీధుల్లో పల్లకిలో ఊరేగించారు. అర్చకస్వాములు గ్రామ అష్ట దిక్కులకు స్వామివారిని తీసుకువెళ్లి గ్రామ బలిహరణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారిని ఆస్థాన మండపంలోకి తీసుకు వచ్చి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం (స్థల, దేహ శుద్ధి) తదితర పూజలు చేశారు. అనంతరం నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు రామక్షేత్రానికి విచ్చేసి తిరుపతి నుంచి వచ్చిన పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించారు. స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. సాయంత్రం 4 గంటలకు మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల సాక్షిగా వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు జరిపించారు. అనంతరం యజ్ఞోపవీత ధారణ చేపట్టి తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు.



స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

26న స్వామివారికి చక్రస్నానం

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 26న స్వామివారికి చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అనంతరం ఆఖరి ఘట్టమైన ధ్వజావరోహణను జరిపించి మొదటి రోజు ధ్వజస్తంభంపై ఎగురవేసిన గరుత్మంతుడి చిత్రపటాన్ని వేద మంత్రోచ్చారణ నడుమ కిందకు దింపి శ్రీవారి బ్రహ్మోత్సవాలను పూర్తిచేయనున్నారు. ఇందులో భాగంగా శ్రీరామచంద్ర ప్రభువును అదే రోజు సాయంత్రం జమ్మివేటకు తీసుకువెళ్తామని ఆలయ అర్చకస్వాములు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన ఈఓ కిశోర్‌కుమార్, అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్, వరప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.